ఓర్వలేకనే అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

- 150 కోట్ల వెటర్నరీ కళాశాలను గద్దలా కొడంగల్‌కు తన్నుకపోయారు..
- అసెంబ్లీలో కొట్లాడుతా.. సిద్దిపేట అభివృద్ధిని కొనసాగిస్తా..
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఆగస్టు 25 : సిద్దిపేట అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటుందని.. అసెంబ్లీలో కొట్లాడి సిద్దిపేట అభివృద్ధిని కొనసాగిస్తానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 251 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ నా ఊపిరి ఉన్నంత వరకు సిద్దిపేట అభివృద్ధికి కృషి చేస్తానని.. రూ. 150 కోట్లతో నిర్మిస్తున్న వెటర్నరీ కళాశాలను సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు గద్దలా తన్నుకపోయారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కేసీఆర్ నాయకత్వంలో సిద్దిపేటను తెలంగాణలోనే ఉత్తమ నియోజకవర్గంగా అందరి సహకారంతో అభివృద్ధి చేసుకున్నామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 9 నెలల్లో అభివృద్ధి పనులకు ఒక్కరూపాయి కూడా నిధులు కేటాయించలేదన్నారు. సిద్దిపేటకు అనేక విద్యాలయాలు తీసుకువచ్చామని మెడికల్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, పీజీ సెంటర్, వెటర్నరీ కళాశాలలను తెచ్చుకున్నామన్నారు. కేసీఆర్ ఆశీర్వాదంతో రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా సిద్దిపేటను తీర్చిదిద్దుకున్నామన్నారు. శిల్పారామం పనులు ఆగిపోయి 9 నెలలు అవుతుందన్నారు. పనులు కాకుండా అడ్డుకుంటున్నారని.. అసెంబ్లీలో కొట్లాడి సిద్దిపేటకు రావాల్సిన పనులు, నిధులను హక్కుగా తీసుకొని వస్తా అన్నారు. రాష్ట్రంలోని అత్యధికంగా సీఎం సహాయనిధి చెక్కులను అందించిన నియోజకవర్గం సిద్దిపేట అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్లు వినోద్‌గౌడ్, ధర్మవరం బ్రహ్మం, రవీందర్, యోగేశ్వర్, చంద్రం, మల్లికార్జున్, పీఏసీఎస్ చైర్మన్ రమేశ్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు సాయిరాం, సంపత్‌రెడ్డి, శ్రీహరి, శ్రీనివాస్, రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బందారం రాజు, వజీర్, మోయిజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన 'గాగిళ్లాపూర్'

గాగిళ్లాపూర్‌లో బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్తులు

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 25 : మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్‌లో గ్రామస్తులు గ్రామ దేవతలకు భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఆదివారం ఉదయం బొడ్రాయికి బోనాలు, పోచమ్మ, మహంకాళమ్మ, కాళీమాతకు బోనాలు చెల్లించి, మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య అమ్మవార్లకు బోనాలను నైవేద్యంగా సమర్పించారు.

గ్రామదేవతలకు బోనాలు

కొండపాక(కుకునూరుపల్లి), ఆగస్టు 25 : కుకునూరుపల్లి మండలంలోని బొబ్బాయిపల్లిలో ఆదివారం గ్రామస్తులు పోచమ్మ, మైసమ్మకు బోనాలు సమర్పించారు. ఎన్ఆర్‌జీఎస్ స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణర వీందర్ గ్రామస్తులు, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), ఆగస్టు 25 : కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ముష్టం శ్రీనివాస్‌గౌడ్ తల్లి ఇటీవల మృతి చెందగా, విషయం తెలుసుకున్న గజ్వేల్ నియోజవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గజ్వేల్ పీఏసీఎస్ చైర్మన్ జేజేల వెంకటేశ్‌గౌడ్, మంగోల్ మాజీ సర్పంచ్ కిరణ్, పెంటగౌడ్, నాగరాజు, సాయిబాబా తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే గౌరవెల్లి పూర్తి

బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురామ్

సమావేశంలో మాట్లాడుతున్న పరశురామ్

హుస్నాబాద్, ఆగస్టు 25: 2007వ సంవత్సరం నుంచి నిర్లక్ష్యానికి గురైన గౌరవెల్లి రిజర్వాయర్ 2014 తర్వాత బీఆర్ఎస్ హయాంలోనే నిర్మాణం పూర్తి చేసుకున్నదని, రిజర్వాయర్ పూర్తి కాలేదనే అబద్దపు ప్రచారంతో కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురామ్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన విమర్శించారు. అన్ని ఉండీ కూడా చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదని, గౌరవెల్లికి చెందిన ఓ మహిళా రైతు బహిరంగంగా చెప్పినా కాంగ్రెస్ నాయకుల చెవుకెక్కక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. సంపూర్ణంగా రైతు రుణమాఫీ జరిగేంత వరకు, రైతు సమస్యల పరిష్కారం కోసం నిత్యం రైతులతో కలిసి బీఆర్ఎస్ ఉద్యమాలు చేస్తుందని హెచ్చరించారు. సమావేశంలో కౌన్సిలర్ బొజ్జ హరీశ్, బీఆర్ఎస్ యూత్, విద్యార్థి నాయకులు వికాస్ యాదవ్, పుల్లూరి అమర్‌శ్యామ్, చిట్యాల సంపత్, లక్ష్మణ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

అభినవ అంబేద్కర్ 'బీపీ మండల్'

హుస్నాబాద్‌లోని బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హుస్నాబాద్, ఆగస్టు 25: బీసీ కులాలపై సమగ్ర సర్వే నిర్వహించి, బీసీల్లో ఉన్న కులాలకు అనుగుణంగా రిజర్వేషన్లకు రూపకల్పన చేసిన బీపీ మండల్ అభినవ అంబేద్కర్ అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో మండల్ కమిషన్ చైర్మన్ బీపీ మండల్ 106వ జయంతి కార్యక్రమం తెలంగాణ జేఏసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగింది. బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ జేఏసీ కో-ఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, నాయకులు కోహెడ కొమురయ్య, పచ్చిమట్ల రవీందర్ గౌడ్, నాంపెల్లి సమ్మయ్య, సంపత్ కుమార్, లక్ష్మణ్, వడ్డెపల్లి మల్లేశం, వల్లపు రాజు, గడిపె బాలు, కొత్తపల్లి అశోక్, కిష్టస్వామి, బంక చందు, రాజిరెడ్డి, సాంబరాజు, పోలు సంపత్, శ్రీదేవి, రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

హుస్నాబాద్, ఆగస్టు 25 : రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు కిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం హుస్నాబాద్‌లో జరిగిన సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సమస్యలను త్వరలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఉపాధ్యాయులందరికీ అడ్వాన్సీ ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ చెల్లింపులు వెంటనే చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు శంకర్‌నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, మండల బాధ్యులు శంకర్, సోములు, తిరుపతి, కిషన్, నెహ్రూ, కాళిదాసు, జబ్బార్‌సింగ్, శ్యామల, శంకర్‌నాయక్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో కాంగ్రెస్ హైడ్రామా

చేర్యాల, ఆగస్టు 25 : హైడ్రా పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి హై డ్రామా చేస్తున్నారని చేర్యాల మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంగోలు చంటి ఆదివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టడం సిగ్గుచేటని, రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలబ్రిటీల నిర్మాణాలు కూల్చివేసి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నట్లు విమర్శించారు.

PUBLIC NOTICE

The General Public is hereby informed that my client Shanigaram Mallesham s/o late Mallaiah has entered into agreement of sale in respect of land admeasuring Ac. 3.05 guntas in Sy.No.181, 183 and 184 of Komuravelli Village and Mandal (Old Cherial Mandal), Siddipet District(old Warangal District) bounded by: North: land of Komravelli Ravi, South: Road, East: Passage, West: Land of Mohammed Nawazbhagan from its original owners Gollapally Mallesham and Thoutireddy Raji Reddy. If any person(s) or any financial institutions including Banks, having any kind of objection or claims with respect of the said sale transactions or right over the above mentioned property may put-forth their claims and objections before the undersigned with documentary proof within (7) days from the date of this publication, If no claims are received by the said time, my client shall proceed with the sale transaction and complete the same. The objections or claims received thereafter shall not be considered.

Sd/- **K. GAL REDDY**
ADVOCATES
Cell : 9848781078

ఆశీర్వాదం..

హుస్నాబాద్, ఆగస్టు 25 : మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దొడ్ల శ్రీనివాస్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ ఆశీర్వదించారు. కేక్ కట్ చేసి శ్రీనివాస్‌రెడ్డికి, స్థానిక నాయకులకు తినిపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, నాయకులు వెంకట్రామిరెడ్డి, ఎండీ అన్వర్, ఎడబోయిన తిరుపతిరెడ్డి, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, పరశురామ్, కొక్కుల సురేశ్ తదితరులు ఉన్నారు.

చెట్లను కాదు.. కొమ్మలను నరకండి

సిద్దిపేట, ఆగస్టు 25 : ఇరవై ఏండ్లగా పసిపిల్లల్లా పెంచితే ఏపుగా చెట్లు పెరిగాయి.. చెట్లను కాదు.. కొమ్మలను నరకండి.. పూర్తిగా చెట్లను తీసేయడం ఏమిటని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సిద్దిపేట పట్టణం మెదక్ రోడ్డులో ఎమ్మెల్యే హరీశ్‌రావు అటుగా వెళ్తుండగా అకారణంగా చెట్లు కొడుతుండడం గమనించి ఆగి ఎందుకు చెట్లను నరికి వేస్తున్నారని విద్యుత్ శాఖ అధికారులను ప్రశ్నించారు. కరెంట్ తీగలకు చెట్లు అడ్డంగా ఉన్నాయనే నేపంతో పూర్తిగా నరికి వేయడం ఎందుకని ఎమ్మెల్యే హరీశ్‌రావు నిలదీశారు. కొమ్మలను మాత్రమే తీసివేయాలి కానీ పూర్తిగా చెట్లను తొలిగించి పర్యావరణానికి ఎందుకు నష్టం చేస్తున్నారని అధికారులను మందలించారు. పర్యావరణానికి ఎంతో ఉపయోగపడే చెట్లను విచక్షణారహితంగా తొలిగించడం దుర్మార్గమని, తొలిగించాలని ఆదేశించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు హెచ్చరించారు.

కొమ్మలను మాత్రమే తొలిగించాలని సూచిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

పలువురికి పరామర్శ

సిద్దిపేట కమాన్, ఆగస్టు 25 : సిద్దిపేట పట్టణంలోని 27వ వార్డు కౌన్సిలర్ సద్ది నాగరాజురెడ్డి నానమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జర్నలిస్టు మజ్జుకు ఇటీవల చేతికి గాయమై చికిత్స పొందగా, వారి అరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మాజీ కౌన్సిలర్ నందాదేవి భర్తకు వెన్నెముక ఆపరేషన్ కాగా, ఆయన ఆరోగ్య పరిస్థితిని, నారాయణరావుపేట మండలం మల్యాల గ్రామానికి చెందిన రంగారావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు వెంట ప్రజా ప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

కౌన్సిలర్ నాగరాజురెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

రుణమాఫీకాని వాళ్లు దరఖాస్తు చేసుకోవాలి

వర్గల్, ఆగస్టు 25 : మండలంలోని గౌరారం, వర్గల్ తున్కిఖల్సా, వేలూర్, మజీద్‌పల్లి క్లస్టర్ల పరిధిలోని గ్రామాల రైతులు ఎవరికైతే బ్యాంకుల నుంచి రుణమాఫీ కాలేదో వారందరూ తమ తమ బ్యాంక్ అకౌంట్, బ్యాంక్ స్టేటస్, పట్టాదార్‌పాసు పుస్తకం, ఆధార్‌కార్డుల జిరాక్స్‌లను ఆయా క్లస్టర్ల పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని వర్గల్ వ్యవసాయ అధికారి ని శేషశయణ తెలిపారు. మంగళవారం తున్కిఖల్సా రైతు వేదికలో జరిగే వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనవచ్చని ఆమె తెలిపారు.

27న కలెక్టరేట్ల ఎదుట ధర్నా

సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఇలవేని శంకర్

హుస్నాబాద్, ఆగస్టు 25 : రైతు బంధు, రైతు బీమా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ అనుబంధంగా ఉన్న రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27న అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఇలవేని శంకర్ తెలిపారు. ఆదివారం హుస్నాబాద్‌లోని అనభేరి సింగిరెడ్డి స్మారక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన రెండు పంటలకు రైతు బంధు ప్రభుత్వం ఇవ్వలేదని, రైతు బీమా కూడా ఇప్పటి వరకు అమలు కావడం లేదని, ఈ విషయంపై రాష్ట్ర కార్యవర్గంలో చర్చించి ఆందోళనా కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానం చేసినట్లు చెప్పారు. సెప్టెంబర్ 11 నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ సాయుధ పోరాట అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, నాయకులు సత్యనారాయణ, భాస్కర్, వనేశ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ముత్యాల తలంబ్రాలు పంపిణీ

సిద్దిపేట టౌన్,ఆగస్టు 25 : రామకోటి రామరాజు రామసేవ అమోఘం అని శ్రీరామభక్త సేవా సభ్యులు అన్నారు. సిద్దిపేట మార్కండేయ ఆలయంలో ఆదివారం భద్రాచల సీతారామచంద్ర స్వామి వారి ముత్యాల తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం రామకోటి రామరాజును రామభక్త సేవా బృందం సత్కరించింది.

ఆలయానికి మినీ వాటర్ ట్యాంక్ అందజేత

సిద్దిపేట టౌన్, ఆగస్టు 25 : సిద్దిపేట వాసవి వనితాక్లబ్ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నదని లక్సెట్టిపేట మున్సిపల్ చైర్మన్ కాంతయ్య అన్నారు. సిద్దిపేట వాసవి వనితాక్లబ్ ఆధ్వర్యంలో దాత భాగ్యలక్ష్మీ శ్రీనివాస్ దంపతుల సహకారంతో పాత వేంకటేశ్వర స్వామి దేవాలయానికి ఆదివారం మినీ వాటర్ ట్యాంక్‌ను ఆలయ కమిటీ సభ్యులకు అప్పగించారు. క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, క్లబ్ అధ్యక్షురాలు వాణి, ఆలయ కమిటీ సభ్యులు గంప శ్రీనివాస్, అయిత రత్నాకర్, కృష్ణమూర్తి శివకుమార్, వీరేశం, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

కొండపాక(కుకునూరుపల్లి), ఆగస్టు 25 : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతిచెందగా, ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. కారును తప్పించబోయి బైక్ అదుపుతప్పి కిందపడటంతో తీవ్రగాయాలైన సంఘటన కొండపాక పరిధిలోని ఆనంద నిలయం సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురవెల్లి మండలంలోని గురువన్నపేటకు చెందిన అందే వీరేశం ఆదివారం ఉదయం బైక్‌పై గురువన్నపేట నుంచి శనిగరం బంధువుల ఇంటికి వెళ్తున్న క్రమంలో కొండపాక ఆనంద నిలయం సమీపంలో ముందువెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టి కారు ఎడమవైపుకు వెళ్తున్న క్రమంలో వెనుకల వస్తున్న వీరేశం కారును తప్పించబోయి కింద పడి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్‌లో బాధితుడిని సిద్దిపేట దవఖానకు తరలించగా, వైద్యులు పరిశీలించి మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చేర్యాలలో..

చేర్యాల, ఆగస్టు 25 : చేర్యాల పట్టణ శివారు నర్సాయపల్లి దారిలో బొలెరో-బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలపాలయ్యారు. కర్నూల్ జిల్లా డోన్ మండలం మల్కపురం గ్రామానికి చెందిన బోయ హరి (26)తో పాటు నంద్యాల జిల్లా బేతంచర్ల మండలం గూటిపల్లి గ్రామానికి చెందిన బోయన్నగారి బాలకృష్ణ, నర్సాయపల్లి శివారులోని ఓ భవన నిర్మాణం కూలీ పనులు నిర్వహిస్తున్నారు. ఆదివారం చేర్యాల పట్టణంలో సామగ్రి కొనుగోలు చేసి బైక్‌పై ఇరువురు కలిసి తిరిగి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ఢీకొన్నది. దీంతో హరి అక్కడికక్కడే దుర్మరణం చెందగా, బాలకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. చుట్టు పక్కల వ్యవసాయ బావుల వద్ద ఉన్న రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన బాలకృష్ణను చేర్యాల సర్కారు దవఖానకు తరలించారు. ఈ విషయమై పోలీసులు విచారణ చేపట్టారు.

రెండు ఇండ్లల్లో చోరీ

సిద్దిపేట టౌన్, ఆగస్టు 25 : తాళాలు వేసిన ఇండ్లను టార్గెట్ చేసి దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. సిద్దిపేట శ్రీనగర్‌కాలనీలో బాధితురాలు శ్రీలక్ష్మి ఇంట్లో బీరువాలో 14 తులాల బంగారు అభరణాలు, వెండి కడ్డీలు, రూ. 20 వేల నగదును దోచుకెళ్లారు. రాజు ఇంటి తాళాలను పగలగొట్టి రూ. 2లక్షల నగదు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ బృందంతో ఆధారాలు సేకరించి, ఆదివారం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నుమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొమురవెల్లిలో భక్తుల సందడి

చేర్యాల, ఆగస్టు25 : కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో శ్రావణ ఆదివారం పెద్ద సంఖ్యలో తరలివచ్చి మల్లన్నను దర్శించుకున్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఏజీఎం ధనుంజయ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో బాలాజీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు కిశోర్ కుటుంబ సభ్యులతో కలిసి మల్లన్నను దర్శించుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఏర్పుల మహేశ్, సార్ల సురేశ్ తదితరులు ఉన్నారు.

కొమురవెల్లిలో మల్లన్నను దర్శించుకున్న సౌత్ సెంట్రల్ రైల్వే ఏజీఎం ధనుంజయ్

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

సిద్దిపేట పట్టణంలోని ఆదివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కృష్ణుడి వేషధారణలోని చిన్నారులు, ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

-సిద్దిపేట కమాన్, ఆగస్టు 25

ఆట వస్తువులను వినియోగంలోకి తేవాలి

గజ్వేల్, ఆగస్టు 25: గత ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయాలు ఖర్చు చేసి టూరిజం పార్కును ఏర్పాటు చేస్తే ప్రస్తుతం అవి వినియోగంలోకి రాకుండా ఉన్నయని, వాటిని వినియోగంలోకి తీసుకురావాలని సీఐటియూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి అన్నారు. ఆదివారం పాండవుల చెరువును సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయన వెంట రంగారెడ్డి, సాధు, రవికుమార్, యాదగిరి ఉన్నారు.

పాండవుల చెరువుకట్టపై పిల్లల ఆటవస్తువులను పరిశీలిస్తున్న సీఐటీయూ నాయకులు

అంబేద్కర్ వర్సిటీలో నాణ్యమైన విద్య

సిద్దిపేట టౌన్, ఆగస్టు 25 : అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని యూనివర్సిటీ నైపుణ్య శిక్షణ కేంద్ర డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాథ్ సాల్మన్ అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ యూనివర్సిటీ ప్రాంతీయ కేంద్రాన్ని యూనివర్సిటీ పరీక్షల అదనపు నియంత్రణాధికారి డాక్టర్ కృష్ణారెడ్డితో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెగ్యులర్ డిగ్రీ, పీజీ, డిప్లామా కోర్సులు చేయలేని వారు అంబేద్కర్ యూనివర్సిటీ చక్కని అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. అంబేద్కర్ యూనివర్సిటీలో డిగ్రీ కోర్సులు సెమిస్టర్ సిస్టంలోనూ పీజీ కోర్సులు స్కీమ్‌లను నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల కో-ఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, డాక్టర్ పడాల లక్ష్మణ్, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాల నిర్వహణ అభినందనీయం

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 25 : ప్రజారోగ్యం ఉచితవైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో జనవికాస ఆధ్వర్యంలో సీవీవీఎం దవాఖాన ఆధ్వర్యంలో ఆదివారం ఉచితవైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలువురికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. బాలవికాస్ వాటర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేడం లింగమూర్తి, డాక్టర్ సువన్, సీవీవీఎం దవాఖాన ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు దొడ్డి శ్రీనివాస్, వల్లపు రాజు, బాలవికాస ప్రతినిధులు జ్యోతి, నిర్మల, శ్రీమతితోపాటు పలువురు ఉన్నారు.

వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

పంటను ధ్వంసం చేసిన అడవిపందులు

మద్దూరు (ధూళిమిట్ట), ఆగస్టు 25 : చేతికందే దశలో ఉన్న మొక్కజొన్న పంటను అడవిపందులు ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్న సంఘటన ఆదివారం ధూళిమిట్ట మండలంలోని బెక్కల్ శివాలితండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన లకావత్ రాజు అనే రైతు తనకున్న రెండెకరాల్లో వేసిన 'మక్క' పంటను రాత్రి వేళల్లో అడవి పందులు ధ్వంసం చేశాయి. సుమారు రూ. 50 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వర్గల్ ఆలయాల్లో భక్తుల పూజలు

వర్గల్, ఆగస్టు 25 : వర్గల్ విద్యాధరిణి సరస్వతీ మాతాలయం, నాచగిరిశ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవాలయాల్లో ఆదివారం శ్రావణ మాసం సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దేవతామూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన శిక్షణ

సిద్దిపేట టౌన్, ఆగస్టు 25 : ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద విధులు ఏ విధంగా చేపట్టాలి అనే అంశంపై సీఐ ప్రవీణ్ కుమార్ నేత్వత్వంలో పోలీసులకు ఐదు రోజులుగా నిర్వహించిన ట్రాఫిక్ సిగ్నల్స్ పరేడ్ ఆదివారం ముగిసింది. రోడ్డు ప్రమాదాల నివారణకు వివిధ కార్యక్రమాలు నిర్వహించి, నిబంధలనపై వాహనదారులకు అవగాహన కలిస్తున్నామన్నారు. ట్రాఫిక్ ఎస్సై గోపాల్‌రెడ్డి, ఎఏస్సై ఉమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

హైనా దాడిలో 15 గొర్రెలు మృతి

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 25 : హైనా దాడిలో గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన మద్దూరు మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మహ్మద్ సాధిక్ రైతు వ్యవసాయానికి అనుబంధంగా గొర్రెల పెంపకాన్ని చేపట్టారు. రోజు మాదిరిగా శనివారం గొర్రెలను మేతకు తీసుకెళ్లి సాయంత్రం దొడ్డిలో పంపి, ఇంటికెళ్లాడు. ఆదివారం తెల్లవారు జామున వచ్చి చూడగా, 15 గొర్రెలు మృతి చెందడంతో పాటు 5 గొర్రెలు గాయాల పాలయ్యాయి. నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఘటనలో సుమారు రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు సాధిక్ వాపోయాడు. కాగా నెల రోజుల క్రితమే సాధిక్‌కు చెందిన 20 గొర్రెలు హైనా దాడిలో మృతి చెందగా, నెల రోజుల వ్యవధిలోనే మరో 15 గ